RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే
దిన పత్రిక

చేసే పని మంచిదైతే
చాలు. అదే నిన్ను
గొప్పవాడిని చేస్తుంది
- రస్సెల్

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్  సంపుటి : 04  సంచిక : 205
శుక్రవారం, జులై 10, 2026, పేజీలు - 4  వెల : 2/-

# మెల్‌బోర్న్‌లో మోదీకి ఘన స్వాగతం..
## మార్వెల్ స్టేడియం 'హౌస్‌ఫుల్'

**ఆస్ట్రేలియా:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి మెల్‌బోర్న్ మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30 వేల మందికిపైగా ఎన్‌ఆర్‌ఐలు హాజర య్యారు. దీంతో ఒక్కసారిగా స్టేడియమంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్.. మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు.ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజలు, ప్రధాని అల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిడ్నీలో గతంలో రెండుసార్లు ప్రవాస భారతీయులను కలిసిన విషయాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు మోదీ. అహ్మదాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం ఉంటే, మెల్‌బోర్న్‌లో ఐకానిక్ స్టేడియ౦ం ఉందని పేర్కొన్నారు. అయితే.. నేడు మార్వెల్ స్టేడియంలో అభిమానుల సందడి నెలకొనడంతో 'ఈ షో హౌస్‌ఫుల్.. బ్లాక్‌బస్టర్' అని మోదీ వ్యాఖ్యానించగా.. అక్కడివారు ఒక్కసారిగా హర్ష ధ్వానాలతో హోరెత్తించారు.




'భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగా ఉన్నాయి. ఈ బంధాన్ని మరింత దృఢంగా తీర్చిదిద్దడంలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కీలకం. మెల్‌బోర్న్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పుడు 'మినీ ఇండియా'గా గుర్తింపు పొందుతూ, భారతీయ సంస్కృతితో అలల ారుతోంది. భారత్ అభివృద్ధిలో మీరంతా భాగస్వామ్యం కావాలి.. 'గ్రో మోర్.. అచీవ్ మోర్' నినాదంతో ముందుకెళ్లాలి' అని మోదీ పిలుపునిచ్చారు.'5+ రంగంలో భారత్ వేగంగా దూసుకెళ్తోంది. త్వరలో 6+ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తాం. మేడ్ ఇన్ ఇండియాలో భాగంగా 6+ దిశగా పయనిస్తున్నాం. ఓ లక్ష్యం పూర్తైతే.. మరో సంకల్పంతో ముందుకు సాగాలి. రానున్న కాలంలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవబోతోంది. చంద్రయాన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టాం. స్పేస్‌లోకి గగన్‌యాన్‌ను పంపేందుకూ సిద్ధమవుతున్నాం. భారత్‌లో త్వరలో స్పేస్ స్టేషన్‌ను నిర్మించబోతున్నాం. భారత్ శక్తి, సామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' ఓ ఉదాహరణ' అని మోదీ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని విజనరీ నాయకుడిగా అభివర్ణించారు. ప్రపంచ దేశాలకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తున్నారన్న అల్బనీస్.. మోదీ తమకు ఆప్తమిత్రుడని కొనియాడారు.

### క్రీడాకారుల కోసం స్పష్టమైన
# స్పోర్ట్స్ పాలసీ తెచ్చాం
: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జులై 9 :** క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. స్పోర్ట్స్ పాలసీ తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశానికి అకాడమీలు, వసతులు అవసరమని తెలిపారు. ఈరోజు (గురువారం) గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను సీఎం ప్రారంభించారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీని ప్రారంభించారు. స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు, ఎంపీ పీటీ ఉష పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.క్రీడల్లో భారత్ వెనుకబడి ఉంది..క్రీడల్లో భారత్ వెనుకబడి ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ క్రీడల పతకాల పట్టికలో.. భారత్ అట్టడుగు స్థానంలో ఉంటోందని అన్నారు. క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని సూచించారు. పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యంతో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పుకొచ్చారు. దేశం గర్వించే క్రీడాకారులు, వ్యాపారవేత్తలను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఏ రంగంలోనైనా కష్టపడేవారు తప్పకుండా రాణిస్తారని అన్నారు.

### కేసీఆర్‌కు నమ్మకం లేకనే హరీశ్‌రావును
# ఆ పదవి నుంచి తొలగించారు
: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జులై 9 :** మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు.బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

### కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి
# ఒక్క రూపాయి ఇవ్వలేదు
భట్టి విక్రమార్క

**ఖమ్మం జిల్లా, జులై 9 :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం



జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు.పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు.

# ఈనెల 14న మీనాక్షి నటరాజన్‌ను కలుస్తా
: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య వివాదం ముదురుతోంది. దేవాదాయ శాఖతో పాటు జిల్లా రాజకీయాల్లో కడియం జోక్యం చేసుకోవడంపై మంత్రి సురేఖ సీరియస్‌గా ఉన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. ఈ వివాదంపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మంత్రి కొండా తాజాగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను మంత్రి సురేఖ వెల్లడించారు. తాను, తన భర్త ఇద్దరం కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటికి వెళ్లినట్లు సురేఖ వెల్లడించారు. అయితే, ఆయన తీరు చూస్తుంటే వివాదాన్ని పరిష్కరించడం, కలిసిపోవడం ఇష్టం లేనట్లుగా ఉందన్నారు. ఈ




సందర్భంగా ఇంట్లో ఉన్న తనను బయటకు రప్పించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై ఈ నెల 14న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలుస్తానని మంత్రి వెల్లడించారు.మంత్రి చేయాల్సిన పనులు కడియం చేస్తానంటే ఎలా? అంటూ ఈ సందర్భంగా కొండా సురేఖ ప్రశ్నించారు. అధికారులను మూడు నెలలుగా కడియం ఒత్తిడి చేస్తున్నారని, అందువల్లే సమావేశంలో పాల్గొనాల్సి వచ్చిందని అధికారులు చెప్పారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌కు తన బాధ చెప్పుకున్నానని వెల్లడించారు. అన్ని విషయాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారిద్దరూ హామీ ఇచ్చారని తెలిపారు. తన జీవితమంతా ముళ్లబాటేనని ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు.
మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల వ్యవహారంపైనా మంత్రి సురేఖ స్పందించారు. అయోధ్యలో శ్రీరాముడి పేరు చెప్పి దోచుకున్న వారిని ఆయనే శిక్షిస్తాడని ఆమె చెప్పారు.

### సింగరేణి డిమాండ్లపై ఈనెల 20 నుంచి
# నిరవధిక దీక్ష
: కవిత



**భద్రాద్రి కొత్తగూడెం, జులై 9:** సింగరేణి బాయిబాటలో భాగంగా కార్మికులతో మమేకమవుతున్నట్లు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ విధానాలు, బకాయిల వల్ల సింగరేణిపై పెను భారం పడుతోందన్నారు. సింగరేణిలో ఆర్థిక సంక్షోభంతో పని ముట్లు కొనలేని దుస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఓ రూల్, కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం తీరు ఉందని మండిపడ్డారు.తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు.

### భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని నేనే ఆపేశా'..
## డొనాల్డ్ ట్రంప్ నోట మళ్లీ పాత పాట..!



**అమెరికా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడుతున్నారు. గతంలో తన చొరవవల్లే భారత్-పాకిస్థాన్ యుద్ధం ఆగిందంటూ గొప్పలు చెప్పుకొంటున్నారు. ఎయిర్ ఫోర్స్ వన్ ప్రయాణిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది మే నెలలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో 11 విమానాలు కూలిపోయినట్లు చెప్పారు. అయితే అవి భారత్‌వా, పాక్‌వా..? లేదంటే రెండు దేశాలకూ చెందినవా అన్నదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.తన జోక్యంవల్లే ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలు ఆగాయని ట్రంప్ చెప్పారు. నోబెల్ శాంతి బహుమతి కూడా తనకే రావాల్సి ఉన్నప్పటికీ ఇవ్వలేదంటూ ఆక్షేపించారు. మరోవైపు పాకిస్థాన్ విషయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది. ఆపరేషన్ సింధూర్ సమయంలోనూ అమెరికా మధ్యవర్తిత్వం ఏమీ లేదని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో మిలిటరీ చర్యను నిలిపివేసినట్లు పేర్కొన్నది.అయితే ట్రంప్ మాత్రం ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు తాపత్రయపడుతున్నారు. తాను కలుగజేసుకోకపోయి ఉంటే ఇరు దేశాల మధ్య 'అణు యుద్ధం' వచ్చేదని అన్నారు.

### విజయవాడలో జనసేన కీలక భేటీ..
# పార్టీ శ్రేణులకు పవన్ దిశానిర్దేశం..

**విజయవాడ:** నగరంలో జనసేన పార్టీ కీలక సమావేశం ప్రారంభమైంది. జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సాగిన 'రావణ్ ఎపిసోడ్'పైనా సమీక్షించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడంతో పాటు, పార్టీ శ్రేణులు ప్రజల్లో మరింత చురుగ్గా ఉండేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలుస్తోంది.మరోవైపు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జనసేనాని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో నిర్వహించనున్న 'జనగళం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా సమస్యలు స్వీకరించే కార్యక్రమంపై చర్చ జరగనుంది. ఈ కార్యక్రమాలకు



పార్టీకి చెందిన ఒక మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. 'జనగళం'తో పాటు మరికొన్ని ప్రజా కార్యక్రమాల బాధ్యతలనూ పార్టీ నేతలకు అప్పగించే యోచనలో పవన్ ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యక్రమాలపై పర్యవేక్షణ పెంచాలని దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే నియోజకవర్గాలలో సర్కార్యక్రమాన్నీ పర్యవేక్షించి.. ఓట్లు మిస్ కాకుండా చూసేలా పవన్ సూచనలు చేయనున్నారు.ఇదిలా ఉండగా.. చికిత్స నిమిత్తం పవన్ కల్యాణ్ రేపు(శుక్రవారం) ముంబైకి వెళ్లనున్నారు. శస్త్రచికిత్స అనంతరం సుమారు 30 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా కార్యకలాపాల వేగవంతం వంటి అంశాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక: జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమమే లక్ష్యంగా బాధ్యతల స్వీకరణ





**పటాన్‌చెరు, జూలై 09:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డిలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు వీరహత్ అలీ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సభలో, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా విభాగంతో పాటు ప్రధాన కార్యవర్గ బాధ్యతలను భర్తీ చేశారు.

**ఎన్నికైన నూతన బాధ్యులు:**

జనరల్ సెక్రటరీ: రూమాండ్ల అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు: శ్రీనాథ్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి: చెన్న బసవేశ్వర్, జిల్లా సంయుక్త కార్యదర్శి: కే. శ్రీనివాస్ రెడ్డి,జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జాయింట్ సెక్రటరీ: భూపాల్ రెడ్డి..ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు జర్నలిస్టులనుద్దేశించి మాట్లాడుతూ, జిల్లా జర్నలిస్టులందరినీ ఒకే తాటిపైకి తెచ్చి ఐక్యతను కాపాడటమే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. వారు మాట్లాడుతూ.. "జర్నలిస్టులు నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ తమ ఆరోగ్యం, కుటుంబ భద్రతను పణంగా పెడుతున్నారు. అటువంటి జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం. ముఖ్యంగా హెల్త్ కార్డుల మంజూరు, వాటి పునరుద్ధరణ వంటి సమస్యల పరిష్కారంలో తక్షణమే దృష్టి సారిస్తాం. ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు, ఇతర సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తాం" అని హామీ ఇచ్చారు.రాష్ట్ర నాయకత్వం నాయకత్వంలో, జిల్లాలోని ప్రతి జర్నలిస్టు సమస్యపై మేము గళమెత్తుతామని, ఎవరికి ఏ ఆపద వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. తమపై నమ్మకం ఉంచి పదవులు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు వీరహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఏ.కే. ఫైసల్‌లకు మరియు సహకరించిన జిల్లా జర్నలిస్టు మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘం బలోపేతానికి, జర్నలిస్టుల గౌరవ ప్రతిష్టలు కాపాడటానికి నిబద్ధతతో పనిచేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు కాశీపతి, నిరంజన్, నరసింహ, ఉప్పరి రాజు పెద్ద ఎత్తున పాల్గొన్న జర్నలిస్టు.

# మీడియా మిత్రుడు రవీందర్‌ను పరామర్శించిన చేగుంట జర్నలిస్టులు




**చేగుంట, జూలై 09 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం, ఇటీవల కాలుకు శస్త్రచికిత్స (సర్జరీ) చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న తోటి జర్నలిస్ట్, మీడియా మిత్రుడు రవీందర్‌ను చేగుంట మండల కేంద్రానికి చెందిన వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. రవీందర్ త్వరగా కోలుకుని మళ్లీ ఎప్పటిలాగే విధి నిర్వహణలోకి రావాలని తోటి విలేకరులు ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో చేగుంట మండల పత్రికా, సోషల్ మీడియా మిత్రులు అన్నం మహేష్, మొజమిల్, శ్రవణ్,కొండి శ్రీనివాస్ స్టాలిన్ నర్సింలు , దేవేందర్, ప్రవీణ్, నాగార్జున, సతీష్, చిక్కుడు మహేష్, ప్రకాష్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# స్మైల్ డెంటల్ హాస్పిటల్ - ఇప్పుడు చేగుంటలో

**- మీ చిరునవ్వు మా బాధ్యత డాక్టర్ శ్రీకాంత్**

**- తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం డాక్టర్ శ్రీకాంత్**

**చేగుంట, జూలై 09మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రంలోని మెదక్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్మైల్ డెంటల్ కేర్' దంత వైద్యశాల గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు, దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. చేగుంట పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల వారికి అందుబాటులో ఉండేలా ఈ ఆసుపత్రిని ప్రారంభించామన్నారు. ప్రతిరోజూ దంత వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని, అత్యాధునిక పరికరాలతో, ఎంతో క్వాలిటీతో కూడిన చికిత్సను అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు భారం కాకుండా ఎంతో చౌకగా, తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన దంత



వైద్యాన్ని అందిస్తామని డాక్టర్ శ్రీకాంత్ వివరించారు.డాక్టర్ శ్రీకాంత్ తండ్రి లక్ష్మీనరసింహ మాట్లాడుతూ, తమ కుటుంబం తరతరాలుగా వైద్య సేవా రంగంలో ఉందని గుర్తుచేశారు. పూర్వం నుండి తమ తాతగారు, తాము ఆయుర్వేద వైద్యులుగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని, వైద్యమే సేవగా భావించే తమ కుటుంబం నుండి తన కుమారుడు ఉస్మానియా హాస్పిటల్‌లో ఎఫ్.ఐ.సి.ఇ పూర్తి చేసి, దంత వైద్య నిపుణుడిగా ఇక్కడి ప్రజల ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. చేగుంట పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ దంత సమస్యలకు నాణ్యమైన చికిత్సను పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లోడాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ లక్ష్మీనరసింహ, డాక్టర్ బాలరాజ్, శ్రీరామదాస్, గ్రామ ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీ, వివిధ హాస్పిటల్ యజమానులు, నైస్ క్లబ్ సభ్యులు స్థానిక ప్రజలందరు పాల్గొన్నారు.

# ఓటరు నమోదుపై ప్రజల్లో అవగాహన కల్పించిన తెల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి



**రామచంద్రపురం, జూలై 09:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గం, తెల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓటరు జాబితా సవరణ మరియు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు తెల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందేలా చూడటమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, చిరునామా మార్పులు, మరియు సవరణల కోసం ఉపయోగించాల్సిన దరఖాస్తు ఫారమ్ ను ఏ విధంగా నింపాలో ఆయన స్థానికులకు వివరించారు. దరఖాస్తులో అవసరమైన వివరాలను ఎలా పొందుపరచాలి, ఏయే ధ్రువపత్రాలను జత చేయాలి అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సాధారణ ప్రజలకు ఫారమ్‌లు నింపడంలో తలెత్తుతున్న సందేహాలను నివృత్తి చేస్తూ, స్వయంగా దరఖాస్తులను నింపి వారికి అందజేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు కీలకమని, అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ.

**. సంపూర్ణ సహకారం అందిస్తా: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





**అమీన్‌పూర్ జూలై 09: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని , బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్ గూడ ఇందిరమ్మ కాలనీలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయ నూతన నిర్మాణానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... "ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, భక్తుల కొంగుబంగారమై కొలువుదీరిన దుర్గమ్మ తల్లి ఆలయ నిర్మాణం భక్తులందరి సహకారంతో అత్యంత వైభవంగా జరగాలని కోరుకుంటున్నాను. భక్తి భావం సమాజంలో శాంతిని, ఐక్యతను పెంపొందిస్తుంది. ఈ ఆలయ నిర్మాణానికి నా వంతుగా సంపూర్ణ సహకారం అందిస్తానని, భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతుల కల్పనలోనూ ముందడుగు వేస్తానని" భరోసా ఇచ్చారు.ఆలయ నిర్మాణానికి స్థానికులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. త్వరలోనే పనులను వేగవంతం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మల్లేష్, జ్ఞానేశ్వర్, గోపాల్, శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చేగుంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డిని పరామర్శించిన కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి.




**చేగుంట జూలై 9 మెదక్ టుడే న్యూస్**

చేగుంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి సతీమణి మంజుల ఇటీవల మృతి చెందగా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠ రెడ్డి తిరుపతిరెడ్డి గురువారం ఇబ్రహీంపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంజుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డిని కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మనోధైర్యాన్ని అందించారు. మంజుల మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.వీరి వెంట కల్వకుంట సర్పంచ్ అందె. కొండల్ రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# జోనల్ కమిషనర్ క్షేత్ర స్థాయి పరిశీలన: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి





**అమీన్‌పూర్, జూలై 09: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్-47లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, రహదారుల మౌలిక వసతుల కల్పనపై జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ ఈరోజు క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులు మరియు ఇతర విభాగాల అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు.పర్యటనలో భాగంగా ఆయన చేపట్టిన ప్రధాన అంశాలు:మాంస విక్రయ కేంద్రం: ఆర్‌సి పురం మాంస విక్రయ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నెలకొన్న పారిశుద్ధ్య పరిస్థితులు, మురుగునీటి నిర్వహణను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని, వ్యర్థాల తొలగింపు మరియు మౌలిక వసతులను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.మోడల్ రోడ్: నూతనంగా నిర్మిస్తున్న నమూనా రహదారి పనుల పురోగతిని పర్యవేక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో ఎటువంటి రాజీ పడకూడదని సూచించారు.ఎన్‌ఎస్‌ఎల్ రహదారి: ఎన్‌ఎస్‌ఎల్ రహదారి మరియు దాని అనుబంధ మార్గాల పరిస్థితిపై సమీక్ష జరిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రహదారి పునరుద్ధరణ: దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించే పనులను పరిశీలించారు. ప్రత్యేకించి రహదారిపై ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయ నిర్వహణ: సిబ్బంది పనితీరు, కార్యాలయ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, క్షేత్రస్థాయి లో అధికారుల పర్యవేక్షణ పెరగాలని స్పష్టం చేశారు.యంత్రాల నిర్వహణ: పారిశుద్ధ్య పనులకు వినియోగించే జేసీబీ లు, ట్రాక్టర్లు, జెట్టింగ్ యంత్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి, వాటిని సన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ఈ పర్యటనలో శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ శ్రీ అమిత్ నారాయణ్, అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, అమీన్‌పూర్ సర్కిల్ సిబ్బంది, నగర ప్రణాళికా విభాగం మరియు క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు

మెదక్,జులై,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగామహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్లో గురువారం జిల్లా పోషణ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర పోషణ లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి, వారిని వైద్య శాఖ సాయంతో ఎన్ఆర్సీకిపంపించాలన్నారు. అక్కడ ప్రత్యేక ఆహారం, చికిత్స ద్వారా పిల్లలు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. మునగ, కరివేపాకు, నిమ్మ వంటివి ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెప్పారు.అలాగే అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు.అంగన్వాడి కేంద్రాలలో పోషణ వాటికలు ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. పోషణ వాటికలలో కచ్చితంగా మునగ మొక్కలు ప్రతి అంగన్వాడి కేంద్రంలో పెట్టాలని చెప్పడం జరిగిందని 15వ తేదీ వరకు అందరూ పిల్లల పోషణ స్థాయిని గుర్తించి ఈ నెలకు సంబంధించిన పూర్తి నివేదికను అందించాలన్నారు.జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు . విద్యాశాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై



ప్రణాళిక అబద్ధంగా ముందుకు పోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమఅధికారి హేమ భార్గవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గణేష్ వర్ విద్యాశాఖ అధికారి రాజు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతిని తీసుకువెళ్లిన వారిపై కేసు నమోదు.

పాపన్నపేట,జూన్,9,(మెదక్ టుడే న్యూస్)

ప్రేమించి వివాహం చేసుకున్న యువతిని అత్తగారింటి నుంచి బలవంతంగా తీసుకువెళ్లిన యువతి తరపు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం.పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన యువకుడు, కౌడిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకొని ఈనెల 6న పాపన్నపేట పోలీసు స్టేషన్ కు వచ్చారు.ఇద్దరు మేజర్ లు కావడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.అనంతరం యువకుడు యువతిని తీసుకొని ఎల్లాపూర్ లోని ఇంటికి వెళ్లాడు.బుధవారం యువతి తరపు వారు ఎల్లాపూర్ లోని యువకుడి ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న యువతిని బయటకు తీసుకువచ్చారు.అడ్డు వచ్చిన యువకుడి కుటుంబీకులను తప్పించి యువతిని బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకువెళ్లడంతో యువకుడు ఈ మేరకు యువకుడు ఠాణాలో ఫిర్యాదు చేయగా యువతి తరపు వారు ఐదుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.ఇదిలా ఉండగా గురువారం మెదక్ సీఐ కార్యాలయంలో యువతి, యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు.యువతి ఇష్టం మేరకు ఆమెను యువకుడికి అప్పగించారు.

# కేటీఆర్ ను కలిసిన కోలేటి



హైదరాబాద్: ఎస్ఐఆర్ కార్యక్రమంపై హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాలకు చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శాసనసభ్యులు మరియు నియోజకవర్గాల ఇన్చార్జిలతో టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్యఅతిథిగా హాజరై దిశ దశలను నిర్దేశించారు.ఈ కార్యక్రమంలో అంబర్ పేట ఇన్చార్జి,టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు

# బంగారు గుండ్ల కోసం వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు, రూ.6 వేల జరిమానా

**- శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్**

మెదక్,జులై,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఖాద్లూర్ గ్రామానికి చెందిన శివకుమార్ (28) బంగారు గుండ్ల కోసం ఓ వృద్ధురాలిని గొంతు పిసికి హత్య చేసిన కేసులో జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.ఖాద్లూర్ గ్రామ శివారులోని దత్తాత్రేయ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ 75 ఏళ్ల అంజమ్మ ఒంటరిగా నివసించేది. ఆమె మేనల్లుడు రాములు ప్రతిరోజూ ఆమెకు భోజనం తీసుకెళ్లేవాడు. 2024 ఆగస్టు 7న రాత్రి సుమారు 10:20 గంటలకు విధులు ముగించుకొని అంజమ్మను చూడడానికి వెళ్లిన రాములు ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా ఆమె మృతదేహంగా కనిపించింది. అదే సమయంలో గుడిసెలో ఒక మూలన దాక్కొని ఉన్న శివకుమార్‌ను గుర్తించిన రాములు, "ఇక్కడ ఏమి చేస్తున్నావు?" అని ప్రశ్నించగా, శివకుమార్ కర్రతో దాడి చేయడానికి ప్రయత్నించాడు. రాములు తప్పించుకోగా,




నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం జరిగిన దర్యాప్తులో అంజమ్మను గొంతు పిసికి హత్య చేసి, ఆమె ధరించిన బంగారు గుండ్లను అపహరించినట్లు తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారులు సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి సమగ్రంగా విచారణ చేపట్టి పక్కా సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు శివకుమార్‌ను దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో టేక్మాల్ ఎస్ఐ అరవింద్, లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ కృష్ణ సహకరించారు. ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

**:- లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో**

**:- రేకుర్తి కంటి ఆస్పత్రి వారి సహకారంతో**




రామగుండం,జులై 9-

లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఎన్టిపిసి సాయి సేవా సమితిలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించారు.ఈ కంటి ఆపరేషన్ శిబిరానికి సుమారు 109 మంది హాజరవగా రేకుర్తి ఆసుపత్రి టెక్నిషియన్ ప్రభాకర్ వైద్య పరీక్షలు నిర్వహించి 46 మందిని ఆపరేషన్ నిమిత్తం బస్సులో రేకుర్తికి తరలించడం జరిగింది.వీరికి గురువారం వైద్య పరీక్షలు జరిపి శుక్రవారం ఆపరేషన్ చేసాక శనివారం తీసుకురావడం జరుగుతుందని క్లబ్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ కోదాటి ప్రవీణ్,సెక్రటరీ ఐ ఎన్ ఎతిరాజు సురేష్,ట్రెజరర్ ఐ న్ రెడ్డి రవీందర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లియో టు లయన్ జిల్లా కో ఆర్డినేటర్ నార్ల ప్రసాద్,విశిష్ట అతిధులుగా జెడ్ సి ఐ ఎన్ కొమురవెల్లి సుధాకర్,డీసీ ఐ స్క్రీనింగ్ క్యాంపు ఐఎన్ మామిడిపల్లి శ్రీధర్,డీసీ రిజల్టు స్టూడెంట్ ఐ ఎన్ గోపాల్ రావు,జి ఎస్ టి సపోర్టింగ్ ఐఎన్ గుంత వినోద్,లయన్స్ షేగంటి నరేష్ రమణా రావు,రంగారావు,అశోక్ రావు,చింతల సతీష్,మహేందర్ రెడ్డి,కొమురవెల్లి రాహుల్,అనిల్ రావు,సాయి సేవా సమితి నిర్వాహకులు ఆశోక్ రెడ్డి,వేణు,నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం, సాగునీరు, వర్షపాతం పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్






మెదక్,జులై,9,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ పంటల ప్రణాళికపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ , జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ , ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ మిషన్ భగీరథ ఇంట్రా నాగభూషణం ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,జూలై 9 నాటికి రాష్ట్రంలో 15 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు.14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు.కృష్ణా బేసిన్‌లో గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, ఇప్పటివరకు ఎగువ రాష్ట్రాల నుంచి ఎలాంటి ప్రవాహం రాలేదన్నారు.ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తాగునీటికి మాత్రమే సరిపడా నీరు అందుబాటులో ఉందన్నారు. గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, నిజాంసాగర్, సింగూరు, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఇప్పటివరకు వరద రాలేదని, వచ్చే వారం రోజులపాటు భారీ వర్షాల అవకాశాలు లేవని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు.నిపుణుల అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో ఆగస్టులో మాత్రమే సాధారణానికి సమీపంలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, జూలైలో 25 శాతం, ఆగస్టులో 9 శాతం, సెప్టెంబరులో 42 శాతం, అక్టోబరులో 55 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వచ్చే వరదలపైనే కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు నిండే పరిస్థితి ఆధారపడి ఉందని, ఆ అవకాశాలు కూడా పరిమితంగానే ఉన్నాయని తెలిపారు.గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున ఈ ఖరీఫ్‌లో సాగునీటి విడుదలకు ప్రణాళికలు లేవని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి ఆదేశించారు.దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల పరిధిలో సాధ్యమైన మేరకు నీటిని తరలించి చెరువులు, కుంటలు నింపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులు వరి సాగు చేయవద్దని స్పష్టమైన సందేశం ఇవ్వాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికలు, ప్యాక్స్‌ల ద్వారా రైతులకు నీటి లభ్యత, వర్షపాతం అంచనాలపై విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి రైతు వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పంటలు సాగు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో ప్రభావం, జలాశయాల్లో నీటి కొరతపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వాతావరణం, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజాప్రతినిధులు, రైతులకు సమాచారం అందించాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాల సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జూలై 15 తర్వాత జలాశయాల్లో నీటి నిల్వలను సమీక్షించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వరద పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద వస్తే వెంటనే నీటిని ఎత్తిపోసేలా పంపింగ్ వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలని, అప్పటివరకు అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ,సూపర్ ఎల్‌నినో పరిస్థితి వాస్తవమని, ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకోవాలని అన్నారు. రాష్ట్రంలో 132 లక్షల ఎకరాల సాగు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 55 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు.జిల్లాలోని నీటి వనరుల పరిస్థితిని పరిశీలించి పంటల వైవిధ్యీకరణను విస్తృతంగా ప్రోత్సహించాలని, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు అనుకూల పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అవగాహన కల్పించాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరంజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో.. జిల్లాలోని నీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సన్న వడ్లు సాగుచేసిన వరి నారును పరిశీలన

**:- మండల వ్యవసాయ అధికారి కే.సతీష్ కుమార్**

రామగుండం,జులై 9



అంతర్గామ్ మండల కేంద్రంలో సన్న రకాల వడ్లు సాగు చేసిన వరి నారుమడులు మండల వ్యవసాయ అధికారి కె.సతీష్ కుమార్ పలిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రైతులతోమాట్లాడుతూ కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు,ఇతర పురుగుల నుండి ముందస్తు రక్షణ కొరకు నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఒక సెంటు నారుమడి కి 160 గ్రాములు,చొప్పున వేయాలి.నారు మడుల్లో తెగుళ్ల నివారణ కుంకార్బన్డిజమ్ం మ్యాంకోజెన్) మందును పిచికారి చేయాలి.అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 2.5 మిల్లి 16 కొనలని కత్తరించి నాటుకోవాలి.తూర్పు-పడమర దిశలో ఉండేలా ప్రతి 2 మీటర్ల కి 20 సెంటీమీటర్ల కాలిబాటలు తీయాలి.తద్వారా గాలి,వెలుతురు బాగా సోకి, చీడపీడల వ్యాప్తి తగ్గుతుందని రైతులకు అవగాహన కల్పించిన అంతర్గాం మండల వ్యవసాయ అధికారి కే.సతీష్ కుమార్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

# సర్కార్ వారి హెయిర్ స్టైల్ - స్కూల్ విద్యార్థులు ఇలాగే కటింగ్ చేయించుకోవాలి



**హైదరాబాద్ :** ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనది. చిన్న వయసు నుంచే బాలలకు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందులో భాగంగానే పాఠశాల విద్యార్థులకు కేశాలంకరణ(హెయిర్ స్టైల్) విషయంలో సర్కారు నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యార్థి రూపం వారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా విద్యాశాఖ వెల్లడించింది. నిబంధనలు ఇలా : విద్యాశాఖ నూతన నిబంధనల ప్రకారం మగ విద్యార్థులు జుత్తును సరళంగా, శుభ్రంగా కత్తిరించుకోవాల్సి ఉంటుంది. వెనుక భాగంలో చక్కగా, శుభ్రంగా హెయిర్?కట్ చేసుకోవాలి. చిన్న కేశాలకు అనుమతి ఉంటుంది. క్రమశిక్షణకు విరుద్ధంగా, వింతగా ఉండే హెయిర్?? స్టైల్?ను ఇకమీదట తరగతి గదులోకి అనుమతించరు. తల్లిదండ్రులు ఈ విషయమై సహకరించాలని పాఠశాలల నిర్వాహకులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క విద్యార్థీ లేని బడుల సంఖ్య ఈసారి సున్నా. ఇలాంటి బడులు 2022-23లో 1,672, 2023-24లో 2,097 ఉండగా 2024-25 సంవత్సరంలో 2,245కు పెరిగింది. కాగా ఈసారి ఒక్కటీ లేకపోవడం గమనించదగ్గవిషయం. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు సంబంధించి 2025-26 అకాడమిక్ ఇయర్?లో ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం(యూడైస్) గణాంకాలను కేంద్ర విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. తగ్గిన సింగిల్ టీచర్ పాఠశాలల సంఖ్య : ఈసారి యూడైస్ గణాంకాల్లో జీరో విద్యార్థులున్న పాఠశాలలను చూపరాదని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటిని తాత్కాలికంగా మూసివేశామనే ఆప్షన్‌ను ఎంచుకుంది. ఈ క్రమంలో విద్యార్థులు ఒక్కరూ లేని పాఠశాలల సంఖ్య సున్నాకు పడిపోయింది. విద్యార్థులు చేరినట్లయితే మళ్లీ వాటిని తెరుస్తారు. 2022-23లో 6,054 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉండగా 2023-2024లో 5,895, 2024-25లో 5,001, 2025-26లో 4793కి తగ్గడం విశేషం. పాఠశాలల్లో మౌలిక వసతుల్లో జాతీయ సగటు కంటే రాష్ట్ర పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో బోధించే ఉపాధ్యాయులు/అధ్యాపకులు 3,70,756 మంది ఉండగా వారిలో అధికశాతం 2,42,377 (65%) మంది మహిళలున్నారు. 42,755 విద్యాసంస్థల్లో 76.76 లక్షల మంది విద్యార్థులున్నారు. అంటే ఒక్కో దాంట్లో విద్యార్థుల సగటు 184. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రానికి 13వ స్థానం. మొత్తం విద్యారుల్లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటున్నది కేవలం 26.52 లక్షల మందే. ఎయిడెడ్ పాఠశాలల్లో 69,651 మంది ఉండగా పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో 49.52 లక్షల మంది చదువుతున్నారు. మంది ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్?లో చదువుకుంటున్నారు.

# 'కేసీఆర్ నాయకత్వంలో సిరుల గనిగా సింగరేణి



**హైదరాబాద్ :** సింగరేణిలో రాష్ట్రప్రభుత్వం వాటా 51 శాతం.. కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం ఉందని.. బీజెపి , కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగ రేణిని నిర్వీర్యం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వం లో సింగరేణిని లాభాల బాట పట్టించాం.. సింగరేణిలో కారుణ్య నియామకాలను కేసీఆర్ ఇచ్చారు.. జీవో 76 క్రింద వేలాది కుటుంబాలకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంలో కేసీఆర్ కృషి ఉంది. గనుల వేలానికి సంబంధించిన ఎంఎంటీఆర్ బిల్లును నేను ఎంపీగా వ్యతిరేకించా.. బీఆర్ఎస్ ఆ చట్టానికి వ్యతిరేకంగా లోక్‌సభ నుంచి వాకౌట్ చేసింది.. సింగరేణిని వేలం పాట పెడితే సింగరేణి నష్ట పోతుందని ఆనాడే రాజ్యసభలో మా పార్టీ తరపున ఆనాడు కేశవరావు మాట్లాడిండు. సింగరేణి బొగ్గు బావులను వేలం వేయొద్దని ప్రధాని మోడీకి కేసీఆర్ లేఖ రాశారు. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని సిరుల గనిగా ఉంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణిలో కుంభకోణాలకు అడ్డాగా మారిపోయిందని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ తో నాదీ టెండర్ లో కుంభకోణం చేశారు. 42 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు 16 వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సింగరేణిలో మొత్తం 16 వేల కోట్ల కుంభ కోణాలు జరిగాయన్నారు. మా నాయకుడు హరీష్ రావు బొగ్గు నిల్వల చూసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకున్నారు.

# ఈనెల 11న యాదగిరిగుట్ట



**యాదగిరిగుట్ట :** ఈనెల 11న యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భవాని శంకర్) వెల్లడించారు. గురువారం ఈవో కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తిరుమల తరహాలో ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉదయం 11 .37 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. అనంతరం ప్రెసిడెంట్ సూట్‌లో ట్రస్ట్ బోర్డ్ మొదటి సమావేశం జరుగుతుందని వివరించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా ఎం సత్యనారాయణ రెడ్డి , మరో ముగ్గురు సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మీడియాకు అనుమతి లేదన్నారు. స్వీకారో త్సవం నిరాడంబరంగానే కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులకు ఎవరికి ఆహ్వానం అందజేయలేదని ఈవో వెల్లడించారు. ఒకవైపు దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికను వీఐపీలకు అందజేస్తూనే మరోవైపు ఎవరికి ఆహ్వానం లేదనడంపై విచిత్రంగా ఉందని స్థానికులు ఆరోపించారు.


# తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ సర్వే - ఈ నెల 24వ తేదీలోపు ఎన్యూమరేషన్ పత్రాలు



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సర్ సర్వే కొనసాగుతోంది. ఎన్యూమరేషన్ ఫారాలను ఈ నెల 24వ తేదీలోపు నింపి బీఎల్‌వోలకు (బూత్ లెవల్ అధికారులు) అందించకపోతే ఓటర్ల జాబి తాలో పేర్లు ఉండవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ శిక్షణ నోడల్ ఆఫీసర్ చెన్నయ్య స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ పత్రం ఇవ్వకపోయినట్లయితే ముసాయిదా జాబితా ప్రకటించిన ఈ నెల 31వ తేదీ తర్వాత ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈటీవీ-ఈటీవీ భారత్? ఆధ్వర్యంలో బుధవారం చెన్నయ్యతో ఫోన్-ఇన్ కార్యక్రమం జరిగింది. ఇందులో పలువురు తమ సందేహాలు వ్యక్తం చేయగా, చెన్నయ్య ఇలా సమాధానాలు ఇచ్చారు. ఎన్యూమరేషన్ ఫారం అందనట్లయితే ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్‌లో మీ పోలింగ్ బూత్‌కు సంబంధించిన బీఎల్‌వో నంబరుకు కాల్ చేస్తే ఎన్యూమరేషన్ పత్రం తీసుకొచ్చి ఇస్తారు. బీఎల్‌వోలు స్పందించనట్లయితే ఈఆర్వో నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. ఎస్ఐఆర్-2002 సర్వేలో ఓటు ఉన్నవారు మొదటి బాక్సు కాలంలో నింపాల్సి ఉంటుంది. 2002లో ఓటు లేనివారు వారి తండ్రి, తల్లి, తాత, నాయనమ్మల్లో ఒకరిది ఎస్ఐఆర్-2002 వివరాలను రెండో బాక్సు కాలంలో నింపాల్సి ఉంటుంది. ఈ రెండు వివరాలూ తెలియని వారు మూడో బాక్సు కాలమ్ పూరించాలి. ఈ నెల 31వ తేదీ తర్వాత ముసాయిదా నోటిఫికేషన్ సమయంలో అడ్రస్? మార్పు కోసం ఫారం-8 నింపి, ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంత ఈఆర్వోకు సమర్పించవచ్చు. ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ)-2002లో పాత జిల్లాలు, నియోజకవర్గాలే వస్తాయి. ఆ వివరాలే నింపాల్సి ఉంటుంది. రాష్ట్రం కాలంలో ఏపీ ఉంటుంది. పొరపాటున తెలంగాణ అని రాసినప్పటికీ ఇబ్బందేమీ లేదు. విదేశీ పౌరసత్వం ఉన్నట్లయితే ఇక్కడ ఎన్యూమరేషన్ పత్రం నిం పొద్దు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటు ఉంటే ఏదైనా ఒక ప్రాంతంలో మాత్రమే ఎంచుకోవావాల్సి ఉంటు ంది. రెండుచోట్లా ఇచ్చినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామని ఈసీ అధికారులు హెచ్చరించారు. ఎన్యూమరేషన్ పత్రాలతో కలిపి ఎలాంటి ధ్రువపత్రాలు ఇవ్వాల్సిన పని లేదు. మీ పత్రంపై అనుమానాలున్నట్లయితే ఈఆర్వో నోటీసులు అందిస్తారు. ఆ సమయంలో అధికారులు అడిగిన డాక్యుమెంట్లు సమర్పిస్తే సరిపోతుంది. ఇలా చేయొచ్చు : ముందుగా గూగుల్‌లోకి వెళ్లి జశేవతీం.వఱఅ.స్త్రశీజ.అఅ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలి. తొలిసారి వెబ్?సైట్?ను సందర్శిస్తున్నట్లయితే లాగిన్ కోసం అందులో సెల్?ఫోన్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) వస్తుంది. దాని ద్వారా పోర్టల్‌లోకి లాగిన్ కావాల్సి ఉంటుంది. అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అనే పేరుతో ఫిల్ ఎన్యూమరేషన్ ఫారం అనే పేరుతో ఉన్న లింక్?పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత రాష్ట్రాన్ని ఎంపిక చేస్తే కుడి వైపు మరో ఆప్షన్ కనిపిస్తుంది. అందులో ఓటర్ కార్డు సంఖ్యను ఎంటర్ చేయాలి. తర్వాత మరో ఆప్షన్ తెరపైకి వస్తుంది. అందులో ఎంటరైన మొబైల్? నంబర్?కు ఎంటర్ చేస్తే మరో ఓటీపీ వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో చివరగా 2002లో సమగ్ర ఓటరు జాబితాను(ఎస్?ఆర్?ఐ) తయారు చేశారు. ఆ సమయంలో ఉన్న కుటుంబీకులు తండ్రి లేదా తల్లి ఓటరు ఐడీ ద్వారా కనెక్ట్ చేయాల్సి ఉంటుంది. తల్లిదండ్రుల ఓటరు గుర్తింపు ఆప్షన్‌ను కల్పించారు. వారి 2002లోని ఓటరు కార్డు కావాలంటే వెళ్లి చూసుకోవచ్చు.

ఒకవేళ నియోజకవర్గం మారినా, వేరే జిల్లాలో ఉన్నా ఎంపిక చేసుకునే అవకాశాన్ని కూడా ఈసీ అధికారులు కల్పించారు. దీంతో ప్రక్రియ పూర్తవుతుంది.

# ఆగస్టు 15లోపు ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం హైకోర్టుకు వివరించిన ప్రభుత్వం




**హైదరాబాద్ :** ఆగస్టు 15వ తేదీలోపు ఈ ఏడాదికి సంబంధి ంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ప్రభు త్వం హైకోర్టుకు తెలిపింది. 2, 3, 4వ సంవత్సరం విద్యార్థులకూ ఫీజు చెల్లిస్తామని పేర్కొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టు లో విచారణ జరిగింది. ప్రభుత్వం ఫీజు రీయి ంబర్స్‌మెంట్ చెల్లించడం లేదంటూ పలు ఇంజినీరింగ్ కళాశాలలు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రతిపాదన వ్యతిరేకించిన కళాశాలలు : ఫీజు రీయింబర్స్‌మె ంట్‌పై హైకోర్టులో విచారణ సందర్భంగా ప్రభుత్వ ప్రతిపాదనను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఆ బకాయిలు దాదాపు రూ. 10 వేల కోట్లు ఉంటుందన్నారు. 2023 నుంచి ఉన్న పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. తర్వాత కొంత గడువుతో మిగతా బకాయిలు చెల్లించేలా చూడాలని హైకోర్టును కోరారు. గత విచారణలో జీవో9లో నాలుగు నిబంధనలపై షరతు విధించింది. అందులో కొన్ని నిబంధలపై విధించిన స్టే ఎత్తివేయాలని ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. స్టే వల్ల కొత్తగా చేరిన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. అసలేం జరిగిందంటే? : ఇంజినీరింగ్ ప్రవేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతోపాటు, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫీజులను విద్యార్థుల అకౌంట్లలో వేస్తామంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాలు చేస్తూ పలు కళాశాలలు పిటిషన్‌లు దాఖలు చేశాయి. వీటిపై విచారణ చేపట్టిన హైకోర్టు విద్యార్థుల నుంచి కళాశాలలు ఫీజులు వసూలు చేసుకోవచ్చంటూ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తొలగించాలని కోరుతూ ప్రభుత్వం పిటిషన్?ను దాఖలు చేసింది. వీటిపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయవద్దంటూనే గడువు కోరుతున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఫీజులు విద్యార్థుల అకౌంట్లలో జమయ్యాక వారు చెల్లించకపోతే బకాయిల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందో లేదో చెప్పాలని వారు ప్రశ్నించారు. చెల్లించకపోతే బకాయిల బాధ్యతను ప్రభుత్వం రూ. 2,800 కోట్ల బకాయి ఉండగా రూ. 250 కోట్లు మాత్రమే కేటాయింపు చేశారని పేర్కొన్నారు. గత బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారన్నదానిపై స్పష్టత ఇవ్వడం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ అడ్మిషన్లు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. కాలేజీలు నిరాకరిస్తున్నాయని హైకోర్టుకు వివరించారు. మధ్యంతర ఉత్తర్వుల కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించలేక నష్టపోయే ప్రమాదం ఉందని వాదనలు వినిపించారు.

# మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్ :** తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు (గురువారంతెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ) ని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్) ను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరిం చారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య పాల్గొన్నారు.

# రాజ్యసభ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు నియామకం



**హైదరాబాద్ :** రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ) ఫ్లోర్ లీడర్ గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

# ఈనెల 14న మీనాక్షి నటరాజన్‌ను కలుస్తా



**హైదరాబాద్:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య వివాదం ముదురుతోంది. దేవాదాయ శాఖతో పాటు జిల్లా రాజకీయాల్లో కడియం జోక్యం చేసుకోవడంపై మంత్రి సురేఖ సీరియస్‌గా ఉన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. ఈ వివాదంపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మంత్రి కొండా తాజాగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను మంత్రి సురేఖ వెల్లడించారు. తాను, తన భర్త ఇద్దరం కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటికి వెళ్లినట్లు సురేఖ వెల్లడించారు. అయితే, ఆయన తీరు చూస్తుంటే వివాదాన్ని పరిష్కరించడం, కలిసిపోవడం ఇష్టం లేనట్లుగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న తనను బయటకు రప్పించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై ఈ నెల 14న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలుస్తానని మంత్రి వెల్లడించారు. మంత్రి చేయాల్సిన పనులు కడియం చేస్తానంటే ఎలా? అంటూ ఈ సందర్భంగా కొండా సురేఖ ప్రశ్నించారు. అధికారులను మూడు నెలలుగా కడియం ఒత్తిడి చేస్తున్నారని, అందువల్లే సమావేశంలో పాల్గొనాల్సి వచ్చిందని అధికారులు చెప్పారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌కు తన బాధ చెప్పుకున్నానని వెల్లడించారు. అన్ని విషయాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారిద్దరూ హామీ ఇచ్చారని తెలిపారు. తన జీవితమంతా ముళ్లబాటేనని ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల వ్యవహారంపైనా మంత్రి సురేఖ స్పందించారు. అయోధ్యలో శ్రీరాముడి పేరు చెప్పి దోచుకున్న వారిని ఆయనే శిక్షిస్తాడని ఆమె చెప్పారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..